ఆక్వా సాగుకు క్రాప్ హాలిడే

- సాగుకు డ్రైనేజీ, సాగునీటి సమస్యలు
- వైరస్‌ల ముప్పు తీవ్రం
- అధిగమించేందుకు రైతుల మూకుమ్మడి నిర్ణయం
- గత పదేళ్లుగా క్రమం తప్పకుండా అమలు


రొయ్యల సాగు చేపట్టకుండా వదిలేసిన గుంట

కావలి : మండలంలోని ఆక్వారైతులు సాగుకు రెండు నెలల పాటు క్రాప్ హాలిడేను ప్రకటించారు. శాశ్వతంగా పట్టి పీడిస్తున్న డ్రైనేజీ, సాగునీటి సమస్యలతో పాటు వైరస్‌ల ముప్పు నుంచి ఉపశమనం పొందడానికి రైతులందరూ ఒకేతాటిపైకి వచ్చి గత పదేళ్లుగా వేసవిలో పంట విరామం పాటిస్తున్నారు. ఈ ఏడాది ఎగుమతుల్లో నెలకొన్న సంక్లిష్టతలతో ధరలు కూడా పతనవడంతో రైతులు ఏప్రిల్ 1 నుంచి మే 30వ తేదీ వరకు సాగుకు విరామం ఇచ్చారు.

3,600 ఎకరాల్లో సాగు

మండలంలోని తీరప్రాంతంలో దాదాపు 3,600 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఆక్వా రంగంపై ఆధారపడి దాదాపు 10వేల మంది జీవనం సాగిస్తున్నారు. గతంలో తీరంలో ఎటుచూసిన రొయ్యల గుంతలే కనిపించేవి. గతంలో బాగా లాభాలు వస్తుండడంతో పెట్టుబడులు ఎక్కువైనా రైతులు సాగుకు వెనకాడే వారు కాదు. ప్రస్తుతం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం గుంతల్లో రొయ్యపిల్లలను వదిలిన నెలరోజులకే సమస్యలు మొదలవుతున్నాయి. నాసిరకం సీడ్ కారణంగా వైరస్‌లు దాడి చేయడం, ఎదుగుదల లోపించడం, పెరిగిన మందులు, మేత ఖర్చులు, లీజు ధరలతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీనికితోడు మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా ఎగుమతుల్లో ఏర్పడిన సంక్లిష్టత వల్ల సాగుదారులు మరింతగా చితికిపోతున్నారు.

వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో..

ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధిని చూపే ఆక్వా రంగం ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. రోజు రోజుకు పెరుగుతున్న పెట్టుబడులకు తోడు వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడంతో ఆక్వా రైతులు ఎన్నడూ లేనంతగా సంక్షోభాన్ని చవిచూస్తున్నారు. వైరస్‌ల నుంచి కాస్తో కూస్తో ఉపశమనం పొందుతున్న తరుణంలో ధరలు పాతాళానికి పడిపోవడం రొయ్య రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టలేక పెట్టినా అవి తిరిగివచ్చే పరిస్థితి లేక రొయ్యల సాగంటేనే రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఏళ్ల తరబడి ఆక్వా సాగు చేస్తున్న అనుభవం కలిగిన రైతులు కూడా ప్రస్తుత ధరల వల్ల దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో ఎకరా గుంతలో 80 వేల నుంచి లక్ష వరకు రొయ్య పిల్లలు వేస్తుండగా రేపటి రోజున ధర ఎలా ఉంటుందోనన్న ఆందోళనతో భారీగా సాంద్రతను తగ్గించుకుంటున్నారు. ప్రస్తుతం ఎకరాకు 40వేల నుంచి 50 వేల పిల్లలను మాత్రమే వదులుతూ నష్టాల నుంచి గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నారు.

నాసిరకం సీడ్‌తో నష్టాలు

వెనామీ గిట్టుబాటు కావడంలేదని తెలిసినప్పటికీ వేరే రకం సాగు చేసే ధైర్యం లేక ఆ రకాన్ని సాగు చేస్తూ నాసిరకం సీడ్‌తో ఆక్వారైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. హేచరీలు సీడ్ తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదు. హేచరీల్లో బ్రూడర్ మల్టిఫికేషన్ సెంటర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, రోజుల వయస్సు ఉన్న పిల్లలను దిగుమతి చేసుకుని పెంచి విక్రయించడం వల్ల నాణ్యత కోల్పోతున్నాయి. తల్లి బ్రూడర్ తెచ్చుకోవడానికి ఎక్కువ ఖర్చు అవుతుందని పిల్లలను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఈ పిల్లలను రైతులు కొనుగోలు చేసి తమ గంతల్లో వేస్తే సక్రమంగా ఎదుగుదల ఉండడం లేదు. మూడు నుంచి 10 గ్రాములలోపే పెరగడంతో ఎకరాకు దాదాపు రెండు టన్నుల రావాల్సిన దిగుబడి రెండు క్వింటాళ్లు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎకరాకు లక్షల రూపాయలను నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోస్టల్ ఆక్వా అథారిటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో హేచరీస్‌లో సీడ్‌ను తయారీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల భారం

ఆక్వా సాగుకు బోర్లు, ఏరియేటర్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుంది. ఈ కారణంగా టారిఫ్ పెరిగి విద్యుత్ చార్జీలు తడిసి మోపడవుతున్నాయని ఆక్వా రైతులు వాపోతున్నారు. గతంలో రూ.20 వేలు బిల్లు వచ్చే చోట రూ.లక్ష వరకూ చెల్లిస్తున్నామని, దీని వల్ల ఆక్వా సాగు చేయాలంటే భయం వేస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు బోర్లలో నీటి మట్టం లోతుకు వెళ్లే సరికి ఉప్పునీరు వస్తుంది. దీని వల్ల రొయ్య ఎదుగుదల ఉండడం లేదు. 150 రోజులకు రావాల్సిన పంట 200 రోజులకు వస్తుంది. దీని వల్ల మేత, విద్యుత్ చార్జీలు అదనపు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నీటిలో లవణ శాతం పెరగడం వల్ల వైరస్‌లు వస్తున్నాయని ఆక్వా రైతులు వాపోతున్నారు. దీంతో సాగు ఖర్చులు భరించలేక కౌంట్ రాకుండానే పట్టుబడి చేస్తే తమ అవసరాలు, ఇబ్బందులను గుర్తించి వ్యాపారులు తక్కువ రేటుకు కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేత ధరలు మండుతున్నాయి



ఆక్వా మేత ధరలు మండుతున్నాయి. విక్రయదారులు టన్ను మేతను రూ.85వేలకు అమ్మకాలు చేస్తున్నారు. అదే అప్పుగా అయితే రూ.95వేలు తీసుకుంటున్నారు. మేతలో ఉపయోగించే సోయాబీన్ ధరలు తగ్గాయి. అందులో వినియోగించే మినరల్స్, ఇతర పదార్థాలపై కస్టమ్స్ డ్యూటీ ఎత్తివేశారు. అలాగే మందులపైన కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. అయినప్పటికీ మేత ధరలను కంపెనీలు తగ్గించడం లేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

– శీను, ఆక్వా రైతు, కొత్తసత్రం

నష్టపోతున్నాం



వెనామీ సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన సీడ్ కావాలి. కానీ హేచరీలు నాసిరకం సీడ్‌ను విక్రయిస్తుండడంతో నెలరోజుల్లోపే వైరస్‌ల బారినపడి పిల్లలు చనిపోతున్నాయి. ఈహెచ్‌పీ సోకిన రొయ్యల్లో 60 రోజులు గడిచినా పెద్దగా ఎదుగుదల ఉండదు. ఓవైపు కౌంట్ రాకపోవడం, మరోవైపు మేత వృథాతో పెట్టుబడులు పెరిగి నష్టపోతున్నాం.

– రాజు, ఆక్వా రైతు, తుమ్మలపెంట

మునిగిపోతున్నాం



హేచరీలు నాసిరకం రొయ్య పిల్లలు అంటకడుతుండడం.. మేత ఉత్పత్తి కంపెనీలు సిండికేట్‌గా మారి ఇష్టానుసారంగా మేత ధరలు పెంచేయడంతో నిలువునా మునిగిపోతున్నాం. ఈ ఏడాది ఆరంభంలో రొయ్యల ధరలు పెరిగాయి. అంతలోనే అమెరికా సుంకాల ప్రభావం అంటూ ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేశారు.

– ఆవుల వాసులు, ఆక్వా రైతు రాముడుపాళెం

క్లుప్తంగా

29న మండల సర్వసభ్య సమావేశం

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జున శనివారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.281

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్టంగా రూ.281 ధర పలికింది. వేలానికి 709 బేళ్లు రాగా, 598 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.281,కనిష్టంగా రూ.210, సగటున రూ.258.15 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజేశఖర్ చెప్పారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



కావలి: పట్టణంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాలలోని జంతుశాస్త్ర విభాగం చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. 1987–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఎమ్మెస్సీ జువాలజీలో ప్రతిభ చూపిన విద్యార్థులు సయ్యద్ సహేరాకు రూ.10వేలు, టీ శివజ్యోతికి రూ.5వేలు నగదు బహుమతులను అందజేశారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న విద్యార్థులు వంశీ, ఉదయ్‌కు రూ.5వేలు చొప్పున నగదు సాయం అందజేశారు. అలాగే జువాలజీ డిపార్ట్‌మెంట్‌కు వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసరావు, జువాలజీ విభాగాధిపతి ఎం సునీల, పూర్వ విద్యార్థి ఎస్వీ నాగేంద్రప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వీ శైలజ, పీ గోపీకృష్ణ, పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలికి కూలిన భారీ వేపచెట్టు



సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరం లోని మెంటల్ రచ్చ మీద ఉన్న వందేళ్ల నాటి భారీ వేపచెట్టు శనివారం మధ్యాహ్నం నేలకూలింది. ప్రతిరోజు చెట్టు కింద ఎంతో మంది సేదతీరుతారు. శనివారం మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత అధికంగా ఉండి ఎవరూ సేదతీరకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో చెట్టు కింద పార్కింగ్ చేసి ఉన్న శీలం శంకర్‌కు చెందిన కారు స్వల్పంగా దెబ్బతింది.

రక్తదాన శిబిరం



కావలి: పట్టణంలోని డాక్టర్ ఉమాచంద్ ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ ఉమాచంద్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో రక్త నిల్వల కొరత ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ విజ్ఞప్తి మేరకు రక్తకొరతను నివారించేందుకు తమ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌లో ప్రతిరోజూ రక్తలేమితో బాధపడే తలసేమియా బాధిత చిన్నారులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం కావలి ఐఎంఏ సహకారంతో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం 44 మంది రక్తదానం చేశారు. రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘనాథ్, రెడ్‌క్రాస్ కోశాధికారి అరికట్ల మధుసూదన్‌రావు రక్తదానం చేసి రక్తదాతలను ప్రోత్సహించారు. ఆస్పత్రి వైద్యులు ఫయాజ్, పీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఏ మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సంగం: స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్‌లో జాతీయ రహదారిపై ఎస్సై రాజేష్ శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు నేర నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి కార్డన్ సెర్చ్‌తో పాటు వాహనాల తనిఖీలు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

భవన నిర్మాణాలకు సులభంగా అనుమతులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణాలకు సులభంగా అనుమతులు మంజూరయ్యేలా వెసులుబాటు కల్పిస్తున్నట్లు కమిషనర్ గంగా ప్రసాద్ శనివారం తెలిపారు. లైసెన్సులు పొందిన సాంకేతిక నిపుణులు, సర్వేయర్లు, ఇంజినీర్ల ద్వారా అనుమతి పత్రాలను తీసుకుని మున్సిపల్ కార్యాలయాల్లో అందజేసి అనుమతులు పొందవచ్చునని చెప్పారు. ఐటీఐ సివిల్, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ పూర్తి చేసిన వారు లైసెన్స్‌ల కోసం మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో మండల పూజోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గంగమ్మ ఆలయానికి భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఇంటి ఆడపడుచులు గంగమ్మ మానుకు ఆనకట్ట కట్టారు. సంప్రదాయంలో భాగంగా ఆలయం వద్ద గుడారి కథను ప్రదర్శించగా భక్తులు తిలకించారు. సాయంత్రం ఇంటి ఆడపడుచులు ఊరేగింపు బోనాలను తీసుకెళ్లి గంగమ్మ మానుకు సమర్పించారు. ఆదివారం వేకువ జామున పొంగళ్లు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ప్రత్యేక ధ్యాన శిక్షణ తరగతులు

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రత్యేక ధ్యాన శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటికి చెందిన ప్రముఖ ధ్యాన మాస్టర్ ప్రభాకర్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారని వివరించారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

104 వాహన సేవలు

వరికుంటపాడు: మండలంలోని వేంపాడులో 104 వాహన సేవలను శనివారం అందజేశారు. వైద్యాధికారిణి ఆయేషా 38 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. హెల్త్‌అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు, కవిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

ఉదయగిరి: ప్రభుత్వం మైనార్టీల ఉపాధికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తోందని ఎంపీడీఓ అప్పాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్హులైన ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిక్కు, జైన్, పార్శీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పనుల కల్పనలో వివక్ష తగదు


మాట్లాడుతున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

సీతారామపురం : గ్రామాల్లో ఉపాధి హామీ పనుల కల్పనలో వివక్ష తగదని, పని కోరిన ప్రతిఒక్కరికీ అధికార యంత్రాంగం పనులు కల్పించాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పక్కాగృహాలను మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంపై వ్యవసాయ శాఖ అధికారులకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల్లో విద్యా బోధన మెరుగునకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సీతారామపురం బీట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలు తారాస్థాయికి చేరాయన్నారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు అధికార యంత్రాంగాన్ని ప్రలోభాలకు గురిచేసి దొంగ మస్టర్లతో బోగస్ హాజరుతో ఉపాధి సొమ్మును దిగమింగుతున్నారని ఆరోపించారు. ఉపాధి పనులపై క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే నిజమైన కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలసవాసులకు మస్టర్లలో హాజరు వేస్తూ నిజమైన కూలీల కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీఓ భాస్కర్ మాట్లాడుతూ ఇకపై ఉపాధి హామీ పనుల్లో తప్పిదాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలాధికారులు శాఖలవారీగా ప్రగతిని వివరించారు. వైస్‌ఎంపీపీ సారమ్మ, తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, ఎంఈఓ మస్తాన్‌వలీ, ఏఓ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు హనీనిషి, తిరుమలయ్య, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య


ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

సోమశిల: కాశ్మీర్ లోయలో పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్యని సీఐటీయూ నాయకుడు అన్వర్‌బాషా అన్నారు. పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ లౌకిక రాజ్యంగా పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అనంతసాగరంలోని పెద్ద మసీదు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ముస్లింలు శనివారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో అశువులు బాసిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్వర్‌బాషా మాట్లాడుతూ దేశ ప్రజలందరూ ఉగ్రదాడులను ఖండిస్తున్నారని, దేశ సమగ్రతను కాపాడుకోవడంలో అందరూ కలిసికట్టుగా ఉన్నారన్నారు. ఉగ్రవాదానికి మతం లేదని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని నాశనం చేయాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

సంగం : సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ముగ్గురు బీటెక్ విద్యార్థుల నుంచి నగదు తీసుకున్నారు. ఆపై ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేసి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై సంగం పోలీసులు శనివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు.. కలిగిరి మండలానికి చెందిన లెక్కల శ్రీకాంత్, కందుకూరుకు చెందిన అళహరి శ్రీనివాసులు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. దువ్వూరుకు చెందిన రావుల శ్రీభరత్ అనే బీటెక్ విద్యార్థికి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఏడాదిగా నమ్మబలికారు. ఈ క్రమంలో శ్రీభరత్‌తో పాటు అదే గ్రామానికి చెందిన ఉప్పు హరీష్, జడపల్లి శ్రీకాంత్ కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందాలని రూ.6.45 లక్షలు ముట్ట జెప్పారు. అయితే నాటి నుంచి నేటి వరకు నగదు తీసుకున్న శ్రీకాంత్, శ్రీనివాసులు ఉద్యోగాలు ఇప్పించకుండా తమను మోసం చేశారంటూ బాధితులు సంగం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీకాంత్, శ్రీనివాసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్



ఆత్మకూరు: విద్యతో ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చని, పదోతరగతి ఫలితాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని అందుకునే దిశగా ముందుకు సాగాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలో పదోతరగతి ఫలితాల్లో ప్రతిభకనబర్చిన వసతిగృహ విద్యార్థులను శనివారం డీడీ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలో వసతిగృహాల విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించి అటు తల్లిదండ్రులు, ఇటు వసతిగృహాలకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు దాచుకునే ఫైళ్లను బహూకరించారు. వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని లాడ్జిలు, దుకాణాల్లో సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. దర్గాకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రూములు ఇచ్చే సమయంలో ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని లాడ్జిల నిర్వాహకులు సూచించారు. దుకాణదారులు లైసెన్సులు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై బీ భాస్కర్‌రెడ్డి, షేక్ జిలానీ తదితరులు ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



కలిగిరి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మజాకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టం, ఫోక్సో యాక్ట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, సైబర్ క్రైమ్ నంబర్ 112, తదితరాలపై అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం సుజాత, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



వరికుంటపాడు: మండలంలోని అన్ని పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కందుకూరు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని వేంపాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్రంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడిపొడి చెత్తను సేకరించి కేంద్రానికి తరలించి వర్మికంపోస్టు తయారు చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగూర్‌వలీ, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్ సందడి


ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న చిత్ర బృందం

అల్లూరు: మండలంలోని ఇందుపూరులో శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. మంద మల్లికార్జునరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తూ ఎంఎంఆర్ ఆర్ట్స్ క్రియేషన్ పతాకంపై ఎన్‌కే కిరణ్ దర్శకత్వంలో 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ పేరు'తో సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నుంచి వచ్చిన చిత్ర యూనిట్ ఇందుపూరు పరిసర ప్రాంతాల్లో కథానాయకుడు శ్యామ్‌సెల్వన్, కథానాయకి ఇషాపై పలు సన్నివేశాలను చిత్రీకరించింది. దర్శకుడు మాట్లాడుతూ సహజత్వానికి అల్లూరు మండలాన్ని షూటింగ్‌కు ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. మండల ప్రజల సహకారంతో సినిమా షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


చేజర్లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉదయగిరి : రాష్ట్ర వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన చేజర్ల సుబ్బారెడ్డికి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఉదయగిరిలో పార్టీ మండలాధ్యక్షుడు జీ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేజర్లను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఆ పార్టీ ఓటమి ఖాయమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. నాయకులు అక్కిభాస్కర్‌రెడ్డి, బాలిబోయిన శ్రీనివాసులు, షేక్ గౌస్ మొహిద్దీన్, ఉప్పుటూరు హరి, గొల్లపల్లి తిరుపతి, వెంగళరావునగర్ తిరుపతి, రమణ, షేక్ ముర్తుజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి


అల్లూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



సీతారామపురం: అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారిణి జయశ్రీ

అల్లూరు: ఖరీఫ్ సీజన్‌లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి సూచించారు. మండలంలోని బీరంగుంటలో భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండలంలోని రైతులు ఎక్కువగా వరి పంట మీద ఆధారపడతున్నారని, వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు, మినుములు, పెసర సాగుచేసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసే రైతులకు విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జిలగ, పిల్లిపెసర్లను 50 శాతం రాయితీతో అందజేస్తున్నామన్నారు. నెల్లూరు ఏడీఏ నర్సోజీరావు, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

సోమశిల: ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తోందని ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అనంతసాగరం మండలం కమ్మవారిపల్లి, సోమశిల గ్రామాల్లోని రైతులకు భూసార పరీక్షలు, ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆయన అవగాహన కల్పించారు. మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో 115 క్వింటాళ్ల జీలుగలు, 33 క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బీడు భూముల్లో ఉద్యాన పంటల సాగుకు చర్యలు

సీతారామపురం : బీడు భూముల్లో ఉద్యాన పంటలను సాగు చేసేలా వ్యవసాయ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారిణి జయశ్రీ సూచించారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో శనివారం వీఏఏలకు నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ఉద్యాన శాఖ తరపున పండ్లు, కొబ్బరి, పూలు, హైబ్రిడ్ కూరగాయలు, వెదురు, పామాయిల్ తోటల సాగు, నీటి కుంటలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

దుత్తలూరు: ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏఓ ఆంజనేయులునాయక్ సూచించారు. మండలంలోని భైరవరం, సోమలరేగడ గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి కోతలు పూర్తయినందున నేల సారం కోల్పోకుండా అదను బట్టి ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము, నువ్వు పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.